క్లుప్తంగా

నేడు ఎమ్మెల్యే రాక

అర్వపల్లి : అర్వపల్లిలోని శ్రీరామ ఫంక్షన్‌హాల్‌లో మంగళవారం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేయనున్నట్లు బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు, రైతుబంధు సమితి జిల్లా సభ్యుడు గుండగాని సోమేష్‌గౌడ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారని తెలిపారు.

నాగారం : మండల కేంద్రంలోని రహదారిబంగ్లాలో మంగళవారం జరిగే షాదీముబాకర్, కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ రానున్నట్లు తహసీల్దార్ వి.బ్రహ్మయ్య, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కల్లెట్లపల్లి ఉప్పలయ్య సోమవారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. లబ్ధిదారులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

నేడు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

తిరుమలగిరి : తిరుమలగిరి మున్సిపాలిటీ పరిధిలోని వివిధ వార్డుల్లో మంగళవారం పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ శంకుస్థాపన చేస్తారని మున్సిపల్ కమిషనర్ దండు శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

'తుంగతుర్తి నుంచి పోటీలో ఉంటా'

అర్వపల్లి : వచ్చే సాధారణ ఎన్నికల్లో తుంగతుర్తి అసెంబ్లీ నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీలో ఉంటానని అంబేడ్కర్ యువజన సంఘాల జిల్లా అధ్యక్షుడు, ప్రగతిశీల తల్లిదండ్రుల సంఘం (పీపీఎల్) రాష్ట్ర అధ్యక్షుడు మచ్చ నర్సయ్య చెప్పారు. సోమవారం విలేకరులతో మాట్లాడారు. తాను చిన్ననాటి నుంచే సామాజిక కార్యకర్తగా పనిచేస్తూ అనేక సేవా కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. బాలకార్మిక వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడానని, అనేక బాల్యవివాహాలను నిలిపివేశానని తెలిపారు. బాలకార్మికులను వెట్టి పనులనుంచి విముక్తి చేశానని చెప్పారు. చదువు వెలుగు కార్యక్రమాలలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పని చేసినట్లు తెలిపారు. మాదిగ సామాజికవర్గానికి చెందిన తనకు పూర్తిగా మాదిగల మద్దతు ఉంటుందన్నారు. ప్రస్తుతం కూడా పీపీఎల్ అధ్యక్షుడిగా పని చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థుల శ్రేయస్సు కోసం పని చేస్తున్నట్లు పేర్కొన్నారు.

పాల సంఘం మాజీ డైరెక్టర్ మృతి


మురళీధర్(ఫైల్)

అర్వపల్లి : మండల పరిధిలోని తిమ్మాపురం మాజీ సర్పంచ్ శ్రీరాముల పరమేష్ సోదరుడు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, పాల ఉత్పత్తిదారుల సంఘం మాజీ డైరెక్టర్ శ్రీరాముల మురళీధర్(70) సోమవారం మృతి చెందారు. మృతుడికి భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఆయన మృతికి గ్రామ శాఖ అధ్యక్షుడు వేములకొండ ఉప్పలయ్య, బీరెల్లి శ్రీధర్‌రెడ్డి, బీరవోలు వాసుదేవరెడ్డి, గోలి కోటిరెడ్డి, ఆర్.లక్ష్మాజి, బాలరాజు, లింగరాజు తదితరులు సంతాపం తెలిపారు.

పశు వైద్యశిబిరం

అర్వపల్లి : మండల పరిధిలోని సూర్యానాయక్ తండాలో సోమవారం పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. కార్యక్రమంలో మండల పశు వైద్యాధికారి డాక్టర్ బి.అర్జున్, వీఎల్‌ఓ కేఎస్ఎస్.పద్మ, సిబ్బంది యాకస్వామి, యాదగిరి పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి పరామర్శ


లక్ష్మమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

పెన్‌పహాడ్ : మండల పరిధిలోని నాగులపాటి అన్నారం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ ధనియాకుల లక్ష్మమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో సోమవారం మృతురాలి కుటుంబాన్ని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నెమ్మాది వెంకటేశ్వర్లు, ములకలపల్లి రాములు పరామర్శించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు వీరబోయిన రవి, వీరస్వామి, యగ్గడి మురళి, మధువర్మ, ధనియాకుల శ్రీకాంత్ వర్మ, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

మోతె: కోదాడ నియోజకవర్గంలో ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ చేసిన అభివృద్ధి, అమలు చేసిన పథకాలపై ప్రచరించిన వాల్ పోస్టర్‌ను మండలంలోని విభళాపురంలో బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు శీలం సైదులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే మల్లయ్యయాదవ్ బడుగు బలహీన వర్గాలకు అండగా ఉండి ఆర్థిక భరోసా కల్పించారన్నారు.


మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

క్రీడాకారుల ఎదురుచూపు

- జాజిరెడ్డిగూడెం మండలంలో 30 క్రీడాప్రాంగణాలకు 17 సిద్ధం
- పలు గ్రామాల్లో ప్రారంభం కాని పనులు
- త్వరగా పూర్తిచేసి వినియోగంలోకి తేవాలని కోరుతున్న యువత



లోయపల్లిలో తెలంగాణ క్రీడా ప్రాంగణం

అర్వపల్లి : గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుంది. ఔత్సాహిక క్రీడాకారులను క్రీడల్లో తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో గ్రామీణ క్రీడా ప్రాంగణాలకు శ్రీకారం చుట్టింది. గ్రామ పంచాయతీలు, ఆవాస గ్రామాల్లో క్రీడా ప్రాంగణాలను నిర్మిస్తుంది. ప్రభుత్వ స్థలాలు ఉన్నచోట ఆ స్థలాలలో ప్రాంగణాలను నిర్మిస్తుండగా లేని చోట్ల ప్రభుత్వ పాఠశాలల్లో ప్రాంగణాలను ఏర్పాటు చేస్తున్నారు. వాలీబాల్, కబడ్డీ, ఖోఖో కోర్టులతో పాటు లాంగ్‌జంప్ పిట్, సింగిల్ ఎక్సర్‌సైజు బార్లను ఏర్పాటు చేస్తున్నారు.

జాజిరెడ్డిగూడెం మండలంలో ఇలా..

జాజిరెడ్డిగూడెం మండలంలో 17 గ్రామ పంచాయతీలు, ఆవాస గ్రామాల్లో 30 క్రీడా ప్రాంగణాలు మంజూరు కాగా ఇప్పటికే 17 ప్రాంగణాలను సిద్ధం చేశారు. మిగిలిన 13 ప్రాంగణాలను నిర్మించాల్సి ఉంది. కాగా నిర్మించిన ప్రాంగణాలలో మైదానం చదును చేయడం, కోర్టుల ఏర్పాటు, ఇతర నిర్మాణ పనులు చేపట్టాల్సి ఉండగా సగం ప్రాంగణాలలో మాత్రమే పనులు చేపట్టారు. మిగిలిన ప్రాంగణాలు కేవలం బోర్డులకే పరిమితమయ్యాయి. కాగా నిర్మించిన ప్రాంగణాలలో పనులు పూర్తిచేసి, మొదలు కాని చోట్ల ప్రాంగణాల పనులు వెంటనే చేపట్టాలని క్రీడాకారులు, యువకులు కోరుతున్నారు. అయితే ప్రాంగణాలలో ఉపయోగించే క్రీడా సామగ్రి ఇప్పటికే ఎంపీడీఓ కార్యాలయానికి చేరుకుంది. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో క్రీడా ప్రాంగణాలకు క్రీడా కిట్లు పంపించారు. కిట్‌లో క్రికెట్‌కు సంబంధించి 12 రకాల సామగ్రి, వాలీబాల్ కిట్, ఫుట్‌పంప్, డంబెల్స్, డిస్కస్‌త్రో, రింగ్స్, స్కిప్పింగ్ రోప్, విజిల్స్, స్టాప్ వాచ్, కిట్‌బ్యాగుతో పాటు క్రీడాకారులకు టీషర్టులు వచ్చాయి. ప్రాంగణాలు సిద్ధం కాగానే ఈ క్రీడా సామగ్రిని ఆయా గ్రామాలకు పంపించనున్నారు.

ఏడాది కిందటే ప్రాంగణం నిర్మించాం



మండలంలో మొట్టమొదటగా కోడూరులో ఏడాది కిందట తెలంగాణ క్రీడాప్రాంగణాన్ని నిర్మించాం. క్రీడాసామగ్రి కోసం అప్పటి నుంచి ఎదురు చూస్తున్నాం. ఈ క్రీడా ప్రాంగణం యువకులు, విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

– గుయ్యని బాబు, సర్పంచ్, కోడూరు

సద్వినియోగం చేసుకోవాలి



గ్రామీణ పాంతాల్లో క్రీడాభివృద్ధి కోసం ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న క్రీడా ప్రాంగణాలను క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలి. జాజిరెడ్డిగూడెం మండలంలో 30 క్రీడాప్రాంగణాలు మంజూరు కాగా ఇప్పటికే 17 ప్రాంగణాలను నిర్మించాం. క్రీడాసామగ్రి కూడా మంజూరైంది. త్వరలో ఎమ్మెల్యే చేతుల మీదుగా క్రీడా సామగ్రిని పంపిణీ చేయడం జరుగుతుంది.

– కతురోజు ఉమేష్, ఎంపీడీఓ, జాజిరెడ్డిగూడెం మండలం

గద్దర్, అలీఖాన్‌ల మృతి తీరని లోటు



సంస్మరణ సభలో పాల్గొని మాట్లాడుతున్న రచయిత కస్తూరి ప్రభాకర్

సూర్యాపేటటౌన్: ప్రజా యుద్ధనౌక గద్దర్, అలీఖాన్ మృతి సమాజానికి తీరని లోటని ప్రొఫెసర్ జానకిరెడ్డి, రచయిత కస్తూరి ప్రభాకర్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని త్రివేణి డిగ్రీ కళాశాలలో గద్దర్, జహీర్ అలీఖాన్‌ల సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఇంజినీరింగ్ విద్యను వదిలి విద్యార్థి దశ నుంచే ప్రజల కోసం గాయకుడిగా మారిన గొప్ప వ్యక్తి గద్దర్ అని కొనియాడారు. నేటి విద్యా వ్యవస్థలో అనేక లొసుగులు ఉన్నాయని, పాలకులు వ్యాపార దృక్పథంతో విద్యను ప్రైవేటీకరిస్తున్నారన్నారు. అలాగే విద్యార్థులకు మూఢనమ్మకాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఆవుల నాగరాజు, డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రేపాల లింగయ్య, అబ్దుల్ కరీం, మాధవరెడ్డి, గుండాల సందీప్, కొండల్‌రెడ్డి, సుదర్శన్, వెంకట్, హరీష్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఏసుక్రీస్తు చూపిన మార్గం అనుసరణీయం


కుంచమర్తిలో చర్చిని ప్రారంభిస్తున్న ఎంపీపీ మన్నె రేణుకలక్ష్మీనర్సయ్యయాదవ్

అర్వపల్లి : ఏసుక్రీస్తు చూపిన మార్గం అనుసరణీయమని ఎంపీపీ మన్నె రేణుకలక్ష్మీనర్సయ్యయాదవ్ అన్నారు. కుంచమర్తి గ్రామంలో నూతనంగా నిర్మించిన చర్చిని సోమవారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. మానవాళి రక్షణకై ఏసుక్రీస్తు ఈ భూమిపై అవతరించాడని చెప్పారు. ఈ సందర్భంగా చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఉగ్గం ఉపేంద్రలింగరాజు, వివిధ ప్రాంతాలకు చెందిన పాస్టర్లు కె.డేవిడ్‌బ్రైనాడ్, జెవైవీ రమేష్‌బాబు, యాన్‌డ్రోస్, పాస్టర్ కె.ఏసుపాదం, డానియేలు, శ్యాంసుందర్, వార్డు సభ్యులు భాగ్యమ్మ, సుహాసిని, జాని, మౌనిక, లింగరాజు, వీరస్వామి, నాగరాణి, క్రైస్తవులు తదితరులు పాల్గొన్నారు.

యూరియా నిలువల పరిశీలన


నెమ్మికల్ పీఏసీఎస్ కేంద్రంలో యూరియా స్టాక్‌ను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి

సాక్షి ఎఫెక్ట్..

ఆత్మకూర్ (ఎస్) : పంటలకు అవసరమైన ఎరువులను ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా రైతులకు అందిస్తున్నామని జిల్లా వ్యవసాయ అధికారి డి.రామారావు నాయక్ అన్నారు. సోమవారం సాక్షిలో ప్రచురితమైన 'యూరియా కొరత.. రైతుల వ్యథ' కథనానికి ఆయన స్పందించారు. సోమవారం మండల పరిధిలోని నెమ్మికల్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో యూరియా స్టాక్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నెమ్మికల్‌లోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో ఆదివారం సాయంత్రం 444 బస్తాల యూరియా, ఏపూరు గ్రామంలోని పీఏసీఎస్ కేంద్రంలో 333 బస్తాల యూరియా అందుబాటులో ఉందని అన్నారు. అదే విధంగా సోమవారం 333 బస్తాల యూరియాను తెప్పించనున్నట్లు ఆయన తెలిపారు. మండలంలో రైతులకు యూరియా కొరత లేకుండా ఎప్పటికప్పుడు సరఫరా చేస్తామని అన్నారు. రైతులు తప్పనిసరిగా బయోమెట్రిక్ ద్వారా యూరియా కొనుగోలు చేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి డి.దివ్య, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సీఈఓ లక్ష్మారెడ్డి, రాము, శ్రీకాంత్ మల్లిఖార్జున పాల్గొన్నారు.

పేదోడి సొంతింటి కల నెరవేరేదెన్నడు..

- డి.కొత్తపల్లి, వర్ధమానుకోట గ్రామాల్లో 'డబుల్' ఇళ్ల పంపిణీలో తీవ్ర జాప్యం
- నిర్మాణాలు పూర్తయి మూడేళ్లు గడుస్తున్నా అర్హులకు తప్పని నిరీక్షణ


డి.కొత్తపల్లిలో నిర్మించిన డబుల్‌బెడ్ రూం ఇళ్లు

నాగారం : ఏళ్లు గడుస్తున్నా పేదోడి సొంతింటి కల, కలగానే మారుతోంది. నిర్మాణాలు పూర్తయి మూడేళ్లు గడుస్తున్నా డబుల్‌బెడ్ రూం ఇళ్ల పంపిణీకి పేదలు నోచుకోవడం లేదు. మండల పరిధిలోని డి.కొత్తపల్లి గ్రామ స్టేజీ వద్ద 2015 అక్టోబర్‌లో 4ఎకరాల స్థలాన్ని సేకరించి, 75 డబుల్‌బెడ్ రూం ఇళ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. అనంతరం 2016 చివర్లో ఈ ఇళ్ల నిర్మాణ పనులను ప్రారంభించి, 2018లో 75 డబుల్‌బెడ్ రూం ఇళ్ల నిర్మాణాలు, ఇళ్ల చుట్టూ ప్రహరీలు పూర్తి చేశారు. ఆనాటి నుంచి నేటి వరకు మూడేళ్లు పూర్తయినా నేటికీ డబుల్ బెడ్ రూం ఇళ్ల పంపిణీ మాత్రం జరగడం లేదు. దీంతో అర్హులైన లబ్ధిదారులు ఇంకెప్పుడు పంపిణీ చేస్తారా అని ఆశగా ఎదురు చూస్తున్నారు. అలాగే వర్ధమానుకోట గ్రామంలో 2018లో 50డబుల్‌బెడ్ రూం ఇళ్ల పనులు చేపట్టి 2019లో నిర్మాణాలు పూర్తి చేశారు. ఇక్కడ కూడా ఇళ్ల నిర్మాణాలు పూర్తయి మూడేళ్లు గడుస్తున్నా నేటికీ ఇళ్ల పంపిణీ జరగలేదు. దీంతో ఇళ్ల మంజూరు కోసం అర్హులైన వారు దరఖాస్తులు పట్టుకొని కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు.

దరఖాస్తులు స్వీకరించి..

డి.కొత్తపల్లి గ్రామంలో నిర్మించిన 75 డబుల్‌బెడ్ రూం ఇళ్లను పంపిణీ చేసేందుకు 2022 డిసెంబర్ 18 నుంచి 27వ తేదీ వరకు అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. డి.కొత్తపల్లిలో 75 ఇళ్లకు గాను 286 మంది దరఖాస్తులు చేసుకోగా రెవెన్యూ అధికారులు దరఖాస్తులను పరిశీలించి వీరిలో 96 మందిని అర్హులుగా గుర్తించారు. అలాగే వర్ధమానుకోటలో 50 డబుల్‌బెడ్‌రూం ఇళ్లకు గాను 162 మంది దరఖాస్తులు చేసుకోగా వీరిలో 132 మందిని అర్హులుగా గుర్తించారు. దీంతో లబ్ధిదారుల్లో ఆశలు చిగురించి దరఖాస్తుఫారం, ఆహారభద్రతకార్డు, ఆధార్‌కార్డు, ఓటర్‌ఐడీ గుర్తింపు కార్డు జిరాక్స్‌లతో తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించారు. కానీ దరఖాస్తులు స్వీకరించి ఎనిమిది నెలలు గడుస్తున్నా నేటికీ ఎలాంటి పురోగతిలేదు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేసి డబుల్ బెడ్ రూం ఇళ్లను వెంటనే పంపిణీ చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

అర్హులకు పంపిణీ చేయాలి



డి.కొత్తపల్లి, వర్ధమానుకోట గ్రామాల్లో నిర్మించిన డబుల్‌బెడ్ ఇళ్లను అర్హులైన లబ్ధిదారులకు మంజూరు చేయాలి. ఇళ్ల నిర్మాణాలు పూర్తయి మూడేళ్లు గడిచినా ప్రభుత్వం ఇళ్ల పంపిణీ ప్రక్రియ చేపట్టలేదు. దీంతో నిర్మించిన ఇళ్లు నిరుపయోగంగా మారుతున్నాయి. ఇళ్ల మంజూరు కోసం అధికారులను విన్నవించినా వారు పట్టించుకోలేదు.

– కడియం కుమార్, సీపీఎం మండల కార్యదర్శి, నాగారం

అంబేద్కర్ యువజన సంఘం కమిటీ ఎన్నిక


నూతన కమిటీ సభ్యులు

నాగారం : మండలం పరిధిలోని లక్ష్మాపురంలో అంబేద్కర్ యువజన సంఘం నూతన కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జలగం అనిల్, ఉపాధ్యక్షుడిగా చిప్పలపల్లి మధు, ప్రధాన కార్యదర్శిగా శాగంటి నవీన్, కోశాధికారిగా మల్లెపాక గణేష్, సహాయ కార్యదర్శిగా కుంటపల్లి హరికృష్ణ, ప్రచార కార్యదర్శిగా గండెల నరేష్, సహాయ కోశాధికారిగా కుంటపల్లి సురేష్, గౌరవ అధ్యక్షులుగా తడకమళ్ల నాగమల్లయ్య, మల్లెపాక యాకయ్య, గౌరవ సలహాదారుడిగా మల్లెపాక గిరి, క్రీడల కార్యదర్శిగా చిప్పలపల్లి ఎలేందర్, సాంస్కృతిక కార్యదర్శిగా చిప్పలపల్లి అయోధ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు జలగం అనిల్ మాట్లాడారు. గ్రామంలో నూతనంగా ప్రతిష్ఠించే అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. తన ఎన్నికకు సహకరించిన కమిటీ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కుంటపల్లి సుధాకర్, మల్లెపాక ముత్తయ్య, కుంటపల్లి యాదయ్య, మల్లెపాక నాగయ్య, మరిపెల్లి వీరయ్య, శాగంటి రవి, కుంటపల్లి చంటి, చిప్పలపల్లి రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో విఫలం



ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

నూతనకల్ : ప్రజాసమస్యలను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కొలిశెట్టి యాదగిరిరావు అన్నారు. ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో పాల్గొని మాట్లాడారు. ప్రధాని నరేంద్రమోదీ ప్రభుత్వరంగ సంస్థలను ప్రయివేటీకరణ చేయడం వల్ల నిరుద్యోగులు రోడ్డున పడ్డారని ఆయన తెలిపారు. పెరిగిన నిత్యావసర ధరల వల్ల ప్రజలపై ఆర్థిక భారం పడిందని అన్నారు. సీఎం కేసీఆర్ ఇంటికో ఉద్యోగం కల్పిస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చలేదని, డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణాలు చేపట్టకుండా గృహలక్ష్మి పథకాన్ని ముందుకు తెచ్చారని అన్నారు. అర్హులైన పేదలందరికీ ఇంటి స్థలాలను అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ ఎన్. శ్రీనివాస్‌రావుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి కందాల శంకర్‌రెడ్డి, బొజ్జ శ్రీను, బత్తుల లింగయ్య, గజ్జెల కృష్ణారెడ్డి, సైదులు తదితరులు పాల్గొన్నారు.

ఓటరు నమోదుకు స్పందన


అర్వపల్లిలో దరఖాస్తు స్వీకరిస్తున్న బీఎల్‌ఓలు

అర్వపల్లి : నూతన ఓటరు నమోదు కోసం మండలంలో రెండు రోజులుగా జరిగిన ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమానికి యువత నుంచి స్పందన లభించింది. రానున్న సాధారణ ఎన్నికల నేపథ్యంలో ఓటరు నమోదు, జాబితా సవరణకు ప్రత్యేక శిబిరాలను రెండు రోజుల పాటు నిర్వహించారు. జాజిరెడ్డిగూడెం మండలంలో 32 కేంద్రాల ద్వారా శనివారం 64, ఆదివారం 48 మొత్తం 112 దరఖాస్తులు వచ్చాయని తహసీల్దార్ జక్కర్తి శ్రీనివాసులు తెలిపారు. అక్టోబర్ 1 నాటికి 18 ఏళ్లు నిండే వారు ఉంటే ఈ నెల 19 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవచ్చని సూచించారు.

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో అల్పాహారం


అల్పాహారం అందజేస్తున్న ఎస్ఏ.రజాక్

మద్దిరాల : మద్దిరాల మండల కేంద్రంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో దాత లయన్ జలగం రామచంద్రన్ సహకారంతో సోమవారం ఉచితంగా అల్పాహారం పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రైతుబంధు సమితి జిల్లా కోఆర్డినేటర్ ఎస్ఏ.రజాక్ ముఖ్య అతిథిగా పాల్గొని గ్రామస్తులకు అల్పాహారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేదలకు లయన్స్‌క్లబ్ వారు చేస్తున్న సేవలు అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ సభ్యులు నలమాస రాములు, వెంకన్న, అశోక్, నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ముత్యాలమ్మ బోనాల పండుగ


బోనాలతో వెళ్తున్న మహిళలు

ఆత్మకూర్ (ఎస్) : ఆత్మకూరు మండల కేంద్రంలో సోమవారం ముత్యాలమ్మ బోనాల పండుగను గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బోనాలను డప్పు చప్పుళ్లతో ఊరేగింపుగా తీసుకెళ్లి ముత్యాలమ్మకు నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. బోనాల పండుగతో మండల కేంద్రంలో భక్తుల సందడి నెలకొంది.

గెలుపునకు కృషిచేస్తాం

నడిగూడెం : వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కోదాడ ఎమ్మెల్యే అభ్యర్థి బొల్లం మల్లయ్యయాదవ్‌ను రెండోసారి ఎమ్మెల్యేగా గెలిపించడం కోసం కృషి చేస్తామని బీఆర్‌ఎస్‌వీ జిల్లా నాయకుడు కేశబోయిన మురళీకృష్ణ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన ఆ సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. మల్లయ్యయాదవ్ బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం కృషి చేస్తున్నారని అన్నారు. ఈ సమావేశంలో బీఆర్‌ఎస్‌వీ మండల అధ్యక్షుడు మేకల వీరేశం, ప్రధాన కార్యదర్శి కాసాని వెంకటేష్, నాయకులు పందిటి నవీన్, సందీప్, ఫయాజ్, నమృత్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం


సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఎంపీపీ, వీఓఏలు

అర్వపల్లి : అభివృద్ధిలో వీఓఏల పాత్ర కీలకమని ఎంపీపీ మన్నె రేణుకలక్ష్మీనర్సయ్యయాదవ్ అన్నారు. వీఓఏల గౌరవ వేతనాలను ప్రభుత్వం రూ.5 వేలకు పెంచడాన్ని హర్షిస్తూ అర్వపల్లిలోని సెర్ప్ కార్యాలయంలో సీఎం కేసీఆర్, మంత్రి జగదీష్‌రెడ్డి, ఎమ్మెల్యే కిషోర్ చిత్రపటాలకు సోమవారం పాలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీఎం మల్లేష్, సీసీలు నగేష్, పద్మావతి, వీఓఏలు కృష్ణకుమారి, లక్ష్మి, విజయ, సుజాత, యాదమ్మ, చంద్రకళ, పద్మ, విజయ్, సురాంబ, సునీత, శంకర్ పాల్గొన్నారు.

హైవేపై బారికేడ్లు ఏర్పాటు చేయాలి


వినతిపత్రం అందజేస్తున్న దామోదర్, తదితరులు

నాగారం: ప్రమాదాల నివారణకు సూర్యాపేట–జనగామ జాతీయ రహదారిపై ఫణిగిరి స్టేజీ వద్ద బారికేడ్లు ఏర్పాటు చేయాలని టెక్నోడీడ్ ఐటీ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ చైర్మన్ వంగూరి దామోదర్ అన్నారు. బారికేడ్లను ఏర్పాటు చేయాలని కోరుతూ గ్రామస్తులతో కలిసి సోమవారం మండల కేంద్రంలో ఎస్ఐ జి.ముత్తయ్యకు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. సూర్యాపేట–జనగామ రహదారిపై బారికేడ్లు లేకపోవడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. రెండు రోజుల క్రితం ఈటూరు గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు ఫణిగిరి వద్ద రోడ్డు ప్రమాదంలో మృతి చెందారని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు, రోడ్డు భవనాల శాఖ అధికారులు స్పీడు నియంత్రణకు బారికేడ్లను ఏర్పాటు చేసి ప్రమాదాలను నివారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తీగుళ్ల నర్సయ్య, పెద్దపల్లి నర్సింహ, బొట్టు సురేష్, సందీప్, రాంపల్లి రమేష్, లవకుమార్, గోపి, నాయకులు పాల్గొన్నారు.

ఆక్రమణ స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని వినతి


తహసీల్దార్ అమీన్‌సింగ్‌కు వినతిపత్రం అందజేస్తున్న పోలుమల్ల గ్రామస్తులు

మద్దిరాల : మద్దిరాల మండల పరిధిలోని పోలుమల్ల గ్రామంలో గ్రామస్తుల అవసరాల కోసం అప్పటి ఎమ్మెల్యే మల్లు స్వరాజ్యం విరాళంగా ఇచ్చిన భూమిని కొంతమంది అక్రమార్కులు ఆక్రమించుకునే ప్రయత్నాలు చేస్తున్నారని ఆ గ్రామానికి చెందిన పలువురు అన్నారు. ఈ మేరకు వారు సోమవారం తహసీల్దార్ అమీన్‌సింగ్‌కు వినతిపత్రం అందజేసి ఆక్రమిత భూమిని స్వాధీనం చేసుకోవాలని కోరారు. భూ ఆక్రమణకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు భూతం సాగర్, శ్రావణి, వెంకటమ్మ, జయమ్మ, భద్రమ్మ, బంగారం, పద్మ, రాజమ్మ, లింగమల్లు, మల్లమ్మ, లింగమ్మ, చంద్రమ్మ, అబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

సబ్బండ వర్గాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం


పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే బొల్లం

కోదాడ: సబ్బండ వర్గాల అభివృద్ధే బీఆర్‌ఎస్ ప్రభుత్వ లక్ష్యమని కోదాడ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ అన్నారు. సోమవారం కోదాడ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మునగాల మండలంలోని వెంకట్రాంపురం, సీతానగరం గ్రా మాలకు చెందిన పలువురు బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పార్టీలో చేరిన వారికి తగిన గుర్తింపునిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు తొగరు రమేష్, సీతారాములు, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, జిల్లేపల్లి వెంకటేశ్వర్లు, శంకర్, నరేష్, నాయకులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

నడిగూడెం : రత్నవరం గ్రామానికి చెందిన కలకొండ గోపాలస్వామి (30) ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో మృతుడి కుటుంబానికి సోమవారం అదే గ్రామానికి చెందిన జీఎస్సీ విక్టరీ ఫౌండేషన్ చైర్మన్ వెంకటేష్‌గౌడ్ సోమవారం రూ.5 వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ఇన్‌చార్జ్ నందిగామ రామారావు, సభ్యులు పోలంపల్లి నర్సింహారావు, కలకొండ సాల్మన్, ఉప్పలయ్య, యేసు, రాజు పాల్గొన్నారు.

మునగాల : మండల కేంద్రానికి చెందిన కోదాటి వెంకయ్య ఇటీవల అనారోగ్యానికి గురై మృతి చెందాడు. దీంతో సోమవారం గ్రామానికి చెందిన శాలివాహన వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో మృతుడి కుటుంబానికి రూ.20వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు సిరికొండ అంతయ్య, సభ్యులు, కుల పెద్దలు పాల్గొన్నారు.


ఆర్థికసాయం చేస్తున్న సొసైటీ సభ్యులు

నిత్యావసరాల ధరలు తగ్గించాలని రాస్తారోకో

హుజూర్‌నగర్ రూరల్ : రోజురోజుకు పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని సీపీఎం మండల కార్యదర్శి పి.హుస్సేన్ డిమాండ్ చేశారు. పార్టీ కేంద్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం మండలంలోని గోపాలపురంలో రోడ్డుపై రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఎం మోదీ ప్రభుత్వ పాలనలో నిత్యావసరాల ధరలను విపరీతంగా పెంచుతున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్, భూస్వామ్య విధానాలను అమలు చేస్తోందన్నారు. నూటికి 90 శాతం ఉన్న పేద, మధ్యతరగతి, కార్మిక వర్గాల ప్రజల అవసరాలను, సంక్షేమాన్ని విస్మరించారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇంటికో ఉద్యోగం కల్పిస్తామని చెప్పి ఊరుకో ఉద్యోగం కూడా ఇవ్వలేదని ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలను పూర్తిగా విస్మరించాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు సిద్దిల వెంకటయ్య, చందాల భిక్షం, జిట్టబోయిన అరవింద్, వెంకటేశ్వర్లు, వెంకటయ్య, విజయలక్ష్మి, రాములమ్మ, వెంకమ్మ, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

6న సుధా బ్యాంక్ రుణ మేళా

కోదాడ : పట్టణంలోని కోర్టు ఎదురుగా ఉన్న సుధా అర్బన్ కోపరేటివ్ బ్యాంక్ ఆధ్వర్యంలో బుధవారం రుణ మేళా నిర్వహిస్తున్నట్లు ఆ బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్ పెద్దిరెడ్డి గణేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటి మరమ్మతులు, వ్యాపార విస్తరణ, వాహనాల కొనుగోలు, గిడ్డంగుల నిర్మాణం వంటి అన్ని రకాల వ్యాపారాలకు ఈ రుణమేళాలో రుణసదుపాయం కల్పిస్తామని పేర్కొన్నారు. పట్టణంతో పాటు పరిసర ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.